బలగం
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 07 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4




బలగం పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు - మీ బలగం బాలు

# వరద బాధితులకు సాయం అందించాలి



- ఏపీతో సమానంగా తెలంగాణకు నిధులు ఇవ్వాలి
- ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.5438 కోట్ల నష్టం
- విపత్తు నిధుల వినియోగం నిబంధనలు సడలించాలి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరద బీభత్సంతో అపార నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వివరించారు. రాష్ట్రంలో వరద నష్టం దాదాపు రూ. 5,438 కోట్లు ఉంటుందని ప్రాథమిక అంచనా వివరాలను తెలిపారు. పూర్తి అంచనాల తర్వాత ఈ నష్టం మరింత పెరిగే అవకాశముందని చెప్పారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్, బండి సంజయ్ కుమార్ గార్లతో ముఖ్యమంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు గారు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, వెంట ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ ప్రాణ నష్టం తప్పిందని, కానీ వరద నష్టం భారీగా జరిగిందని పవర్ పాయింట్ ద్వారా వాటి వివరాలను తెలియజేశారు. వరద ప్రభావిత జిల్లాల్లోని గ్రామాల్లో బాధిత కుటుంబాలు కోలుకోలేని విధంగా నష్టపోయాయని, ఇప్పటికీ ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని సీఎం చెప్పారు. తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున వరద బాధిత కుటుంబాలకు రూ.10 వేలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

విపత్తు నిధులను రాష్ట్రాలకు విడుదల చేసే విషయంలో ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించాలని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వంద శాతం ఎస్డీఆర్ఎఫ్ నిధులు రాష్ట్రాలు వినియోగిస్తేనే, శాశ్వత మరమ్మతు పనులకు ఎన్డీఆర్ఎఫ్ నిధులు వాడుకోవాలనే నిబంధన విధించారు. గతంలో ఉన్నట్లుగా ఈ నిబంధనను సడలించాలని ముఖ్యమంత్రి గారు కోరారు.



# చవితికి బడా గణేష్ సిద్ధం

నేటి నుంచి వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాలకు కలిపి ప్రఖ్యాతి గాంచిన ఖైరతాబాద్ వినాయకుడు నవరాత్రుల పూజలందుకోవడానికి సిద్ధమయ్యాడు. ఈ సారి ఖైరతాబాద్ వినాయకుడు 70 అడుగుల ఎత్తులో కొలువుదీరుతున్నాడు ఖైరతాబాద్ ఉత్సవాలను ప్రారంభించి 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా 70 అడుగుల ఎత్తున్న విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇక, ఈఏడాది వినాయకుడు సప్తముఖ మహాగణపతిగా పూజలందుకునేందుకు సిద్ధమయ్యాడు.

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ కూడా పాల్గొంటారు. ఇక ఎప్పటలానే ఖైరతాబాద్ వినాయకుడిని చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారని అంచనా వేస్తున్నారు.పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ముగ్గురు డీఎస్పీలు, 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 33 మంది ఎస్ఐలతోపాటు 22 ప్లాటూన్ల సిబ్బంది కూడా ఉంటారని సైఫాబాద్ ఏసీపీ ఆర్ సంజయ్ కుమార్ వివరించారు. ఖైరతాబాద్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలను కూడా విధించారు.

బలగం టీవి, హైదరాబాద్

# టీపీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్ గౌడ్




**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర పీసీసీ అధ్యక్షు డిగా మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఏఐసీసీ ప్రకటించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా ఉన్నారు. తెలంగాణ పీసీసీ పదవిని బీసీలకు ఇవ్వాలని నిర్ణయించిన అధిష్ఠానం, ఇందుకోసం మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్లను పరిశీలించింది. వీరిరువురికి సంబంధించి పార్టీ కీలక నేతల నుంచి అభిప్రాయం తీసుకుంది. చివరకు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఖరారు చేసింది.

మహేశ్ కుమార్ గౌడ్ గడిచిన మూడేళ్లుగా పీసీసీ ఆర్గనైజింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన యువజన కాంగ్రెస్ నుంచి పార్టీలో పని చేస్తున్నారు. దీంతో ఈయనకు ఢిల్లీ స్థాయిలో విస్తృతమైన పరిచయాలు ఉన్నాయి.

తనకు టీపీసీసీ అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్ఠానానికి మహేశ్‌కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అప్పగించిన ఈ గొప్ప బాధ్యతలను తాను చిత్తశుద్ధితో అంకిత భావంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా నియమితులు కావడంతో గాంధీభవన్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు చేశారు.

పీసీసీ చీఫ్‌గా నియమితులైన మహేశ్ కుమార్ గౌడ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలో మహేష్ కుమార్ గౌడ్ గొప్పగా రాణించాలని పేర్కొన్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరుకుంటున్నట్లు సీఎం తెలిపారు. మూడేళ్ల క్రితం తనపై ఎంతో నమ్మకంతో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినాయకత్వానికి, సహకరించిన నాయకులకు, వీరోచితంగా పోరాడి, పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహేష్ కుమార్ గౌడ్ నూతన పీసీసీ అధ్యక్షుడిగా నియామకం పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించారు. వీరితో పాటు పలువురు మంత్రులు, పార్టీ నేతలు మహేష్ కుమార్ గౌడ్?కు అభినందనలు తెలిపారు.

# రెండు తెలుగు రాష్ట్రాలకు
## కేంద్రం సాయం రూ.3,300 కోట్లు

**బలగం టీవి, హైదరాబాద్**

లుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవడం వల్ల వరదలు బీభత్సాన్ని సృష్టించాయి. తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి.ఆంధ్రా, తెలంగాణలో సంభవించిన విపత్తుపై కేంద్రం స్పందించింది. రెండు రాష్ట్రాలకు తక్షణ సహాయం కింద నిధులు ప్రకటించింది. వరదల వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు మోదీసర్కారు రెండు రాష్ట్రాలకు కలిపి రూ.3,300 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది.ఏపీలో విజయవాడ, తెలంగాణలో ఖమ్మం వంటి రెండు పెద్ద నగరాలు తీవ్రంగా దెబ్బతినడంపై ఆరా తీసిన కేంద్రం వెంటనే నిధుల్ని విడుదల చేసింది.

వరదల వల్ల సర్వం కోల్పోయిన ప్రాంతాల్ని కేంద్రం తరపున పరిశీలించడానికి వచ్చారు మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. గురువారం ఏపీలోని విజయవాడలో పర్యటించిన ఆయన ..అక్కడి సీఎం చంద్రబాబుతో కలిసి ప్రెస్ మీట్ పెట్టి కేంద్రం అన్నీ విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్రానికి సహాయం చేస్తుందని ప్రకటించారు.శుక్రవారం మరో కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తో కలిసి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలంగాణలోని వరదలు సంభవించిన ప్రాంతాల్ని పరిశీలించారు.ప్రభావిత ప్రాంతాల దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా కేంద్రమంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒకే రోజు అత్యధికంగా 40 సెం.మీ వర్షం కురిసిందని కేంద్ర మంత్రికి సీఎం చెప్పడం జరిగింది.

వరద ప్రభావిత జిల్లాలోని గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందని రోడ్లు, ఇండ్లు, బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రాకపోకలు స్తంభించాయని సీఎం రేవంత్ రెడ్డి శివరాజ్ సింగ్ చౌహాన్ కి తెలిపారు.తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు రూ.10వేలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వరద నష్టం దాదాపు రూ.5,438 కోట్లు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లుగా అధికారులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థన మేరకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి విపత్తుల సమయంలో ప్రజలకు సాయమందించే విషయంలో పార్టీలు, రాజకీయాలు ఉండవని స్పష్టం చేశారు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.

# జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూత



**బలగం టీవి, హైదరాబాద్**

హైదరబాద్ యశోద ఆసుపత్రిలో కొన్ని రోజుల నుంచి చికిత్స పొందుతున్న జిట్టా బాలకృష్ణారెడ్డి తుదిశ్వాస విడిచారు. యాదాద్రి జిల్లా బొమ్మాయిపల్లికి చెందిన ఆయనకు భార్య, కూమార్తె, కుమారుడు ఉన్నారు. యశోద ఆసుపత్రి నుంచి భౌతికకాయాన్ని భువనగిరి శివారులోని ఆయన ఫామ్‌హౌస్‌కు తరలించారు. జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థీవదేహానికి ప్రముఖులు, రాజకీయ నేతలు పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అకాల మరణం తనకు దిగ్భ్రాంతి కలిగించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బాలకృష్ణారెడ్డి తనకు మిత్రుడని, సన్నిహితుడని పేర్కొన్న రేవంత్ రెడ్డి, యువతను ఐక్యం చేసి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అని అభిప్రాయపడ్డారు.జిట్టా బాలకృష్ణారెడ్డి అకాల మరణం పట్ల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. జిట్టా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అకాల మరణం చెందిన జిట్టా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి మృతిపట్ల ఆ పార్టీ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి జిట్టా భౌతికకాయానికి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. బాలకృష్ణారెడ్డి ఉద్యమంలో చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

తెలంగాణ ఉద్యమంలో జిట్టా బాలకృష్ణా రెడ్డి కీలకంగా వ్యవహరించారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉవ్వెత్తున ఉద్యమాన్ని తీసుకెళ్లటంలో కీలక పాత్ర పోషించారు. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పలు దఫాలుగా ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి ఓటమి చవి చూశారు. అయినా ప్రజల పక్షాన, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడారు. జిల్లాలో ఆయనకు భారీగా అభిమానులు ఉన్నారు. ఢిల్లీ, హైదరాబాద్, భువనగిరిలో తెలంగాణ సంస్కృతినీ, జాతరలను, ఉత్సవాలను నిర్వహించిన జిట్టా, గతంలో మూసీ ప్రక్షాలన కోసం పాదయాత్ర, బునాది గాని కాల్వ కోసం ఆమరణ నిరహార దీక్ష చేశారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో స్వంత ఖర్చులతో గ్రామాల్లో వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేశారు.

# మాజీ సీఎం కేసీఆర్ యాగం



**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావ అధికారంలో ఉన్నప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద యాగం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత కూడా కేసీఆర్ యాగం చేశారు. శాసన సభ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమయ్యారు.

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం నుంచి నవగ్రహ మహాయాగం చేపట్టారు. పట్టువస్త్రాల్లో తన సతీమణి శోభతో కలిసి కేసీఆర్ యాగం ప్రారంభించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అయితే ఈ యాగం ఎన్ని రోజులు కొనసాగుతుందనేది ఎవరికీ తెలియదు. కుటుంబసభ్యులు, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ యాగంలో ఉన్నారు. అయితే యాగానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు బయటకు రాలేదు.

అనూహ్యంగా ఈ యాగం నిర్వహించడంపై తీవ్ర చర్చ జరుగుతోంది. అధికారం కోల్పోవడం.. అనారోగ్యం ఏర్పడడం.. కుటుంబసభ్యులు ఇబ్బందులు పడడం వంటి పరిణామాలతో కేసీఆర్ ఈ యాగం నిర్వహించడానికి కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా తన గారాలపట్టీ కవిత కోసం ఈ యాగం నిర్వహించినట్లు సమాచారం. తిహార్ జైలు నుంచి విడుదలైన కవిత కోసం యాగం చేపట్టినట్లు తెలుస్తోంది. కవిత విడుదలైతే యాగం చేస్తానని మొక్కుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా మళ్లీ రాజకీయంగా బలపడడం.. ప్రత్యక్ష రాజకీయాల్లోకి తిరిగి వస్తున్న నేపథ్యంలో ఈ యాగం చేపట్టినట్లు కూడా చర్చ నడుస్తోంది. కేసీఆర్ గతంలో ఇదే మాదిరి కొన్ని యాగాలు నిర్వహించారు.

# కాంగ్రెస్‌లో చేరిన రెజ్లర్లు



- కాంగ్రెస్‌లోకి వినేష్, బజరంగ్.. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ
- జులనా అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్న వినేష్
- బజరంగ్ పునియా ఎన్నికల్లో పోటీ చేయడం లేదు

**బలగం టీవి, హైదరాబాద్**

స్టార్ రెజ్లర్లు వినేష్ ఫొగాట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ పార్టీలో చేరారు. న్యూఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ సమక్షంలో చేరారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు వినేష్ ఫొగాట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు వారు ఇండియన్ రైల్వే ఉద్యోగాలకు రాజీనామా చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన తరువాత వినేశ్ ఫొగాట్ మీడియాతో మాట్లాడుతూ రెజ్లర్ల నిరసన సమయంలో తమను రోడ్డు మీదకు ఈడ్చేసినప్పుడు బీజేపీ మినహా అన్ని పార్టీలు తమకు అండగా నిలిచాయని అన్నారు. ఇప్పుడు తనకు మరో వేదిక దొరికిందని, దేశ సేవకు శక్తివంచన లేకుండా ముందుకు సాగుతానని తెలిపారు. రెజర్ల్ భజరంగ్ పునియా మాట్లాడుతూ, ఈ దేశ పుత్రికల కోసం తమ గళం వినిపించినందుకు మూల్యం చెల్లించుకుం టున్నామని అన్నారు.పారిస్ ఒలింపిక్స్‌లో వినేష్ ఫైనల్‌కు చేరుకున్నాక ఆమెను అనర్హురాలిగా ప్రకటించినప్పుడు అందరూ బాధపడగా, ఒక ఐటి

మిగితా 2వ పేజీలో



# సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ ఇక లేరు

- మానేరు గడ్డమీద నుంచి ఎదిగొచ్చిన వడ్డేపల్లి కృష్ణ..
- చేనేత కుటుంబం నుంచి సాహిత్యం వైపు..

వివరాలు 3వ పేజీలో

## రాష్ట్ర ప్రజలకు

# సీఎం రేవంత్ వినాయక చవితి శుభాకాంక్షలు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్

వినాయక చవితి పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వాడ వాడలా వెలిసే గణేష్ మండపాలలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని సీఎం అన్నారు. ఈ నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ ఏడాది వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుందని సీఎం ఇప్పటికే ప్రకటించారు.

# దేవ దేవుని అనుగ్రహం పొందాలి

- మాజీ సీఎం కేసీఆర్



బలగం టీవీ, హైదరాబాద్

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని గణనాధున్ని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో వినాయకున్ని ప్రార్థించి దేవ దేవుని అనుగ్రహం పొందాలని కేసీఆర్ తెలిపారు.

# కమిషన్లకు చైర్మెన్ల నియామకం

- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా కోదండరెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో కోదండరెడ్డి రెండేళ్ళపాటు కొనసాగుతారు.అలాగే విద్యా కమిషన్ చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి అకునూరి మురళిని ప్రభుత్వం నియమించింది. ఆయన నియామకానికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్‌గా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఉన్న గోపిశెట్టి నిరంజన్ నియమితులయ్యారు. సభ్యులుగా రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిలను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిషన్‌కు సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

# 17న రాష్ట్రానికి అమిత్‌షా..

బలగం టీవీ, హైదరాబాద్

: గత సంవత్సరం మాదిరిగానే ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా, అధికారికంగా నిర్వహించాలని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం యోచిస్తోంది. ఈ విషయాన్ని రాష్ట్ర పార్టీ వర్గాలు ధృవీకరిస్తున్నాయి. గత ఏడాది కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించింది.అయితే ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో ఈ విషయంపై స్పష్టత రావడంలేదు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలోనే పార్టీ ముఖ్య నేతలతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. త్వరలో జరగనున్న ప్రాదేశిక ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం అత్యంత కీలకమని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి.

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సూచనప్రాయ నిర్ణయం మేరకు ఈ నెల 17న హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొంటారని పార్టీవర్గాలు తెలిపాయి.

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. రెండేళ్ల క్రితం సెప్టెంబర్ 17న పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన అధికారిక కార్యక్రమంలో అమిత్ షా వివిధ పోలీసు దళాల వందన స్వీకరణతో పాటు జాతీయపతాకాన్ని ఎగురవేసిన విషయం తెలిసిందే.తెలంగాణ విమోచన దినోత్సవంలో అమిత్‌షాతో పాటు- మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొననున్నారు. గతేడాది కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో గోల్కొండ ఖిల్లాలో హైదరాబాద్ విమోచన వేడుకలను నిర్వహించారు.

ఈ ఏడాది మళ్లీ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్య క్రమానికి అమిత్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన త్వరలోనే బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా వివిధ జిల్లాల్లో తలెత్తిన పరిస్థితులపై చర్చించి క్షేత్రస్థాయి పర్యటనలపై నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.

# రాష్ట్రంలో రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు..!



బలగం టీవీ, హైదరాబాద్

గత వారం రోజుల నుంచి తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. భారీ వర్షాలు, వరదలకు రాష్ట్రంలోని ప్రాజెక్టులు నిండు కుండలా మారాయి. మరో రెండు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.ఈ నెల 7, 8వ తేదీల్లో యతేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇక గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

# మంత్రి సీతక్కపై ఫోన్‌లో దూషణలు

- కేసు నమోదు



బలగం టీవీ, హైదరాబాద్

మంత్రి డి.అనసూయ(సీతక్క)కు పదే పదే ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. బేగంపేట జ్యోతిరావు పూలే ప్రజా భవన్ ఆవరణలోని ఓ భవనంలో మంత్రి అనసూయ నివాసం ఉంటున్నారు. ఈ నెల 4న గుర్తు తెలియని వ్యక్తి సాయంత్రం 4.03, 4.05, 4.56 గంటల ప్రాంతంలో మంత్రి మొబైల్‌కు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించాడు. ఆమె సూచనతో కారు డ్రైవర్ ఎం.శ్రీను పంజాగుట్ట పీఎసలో ఫిర్యాదు చేశాడు.మొబైల్ నెంబర్ ఆధారంగా నిందితుణ్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# స్వచ్ఛ భారత్ ఒక గేమ్ ఛేంజర్

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



బలగం టీవీ, న్యూఢిల్లీ

ప్రజారోగ్యం విషయంలో 'స్వచ్ఛ భారత్' ఒక గేమ్ ఛేంజర్ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శిశు మరణాలను తగ్గించడంలో సరైన శౌచాలయాల (టాయిలెట్స్?) పాత్ర ఎంతో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ద్వారా విప్లవాత్మక మార్పును చూడగలమని అభిప్రాయపడ్డారు. 'స్వచ్ఛ భారత్‌లో భాగంగా శౌచాలయాల నిర్మాణం - శిశు మరణాలు' అనే అంశంపై బ్రిటిష్ సైంటిఫిక్ జర్నల్ నేచర్‌లో ప్రచురితమైన అధ్యయనాన్ని గురువారం ప్రధాని ఎక్స్ వేదికలో పంచుకున్నారు. స్వచ్ఛ భారత్ ప్రయోజనాలను అధ్యయనం చేయడం అభినందనీయమని ఆయన అన్నారు.

దేశంలో చిన్నారుల మరణాలను తగ్గించడంలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో భాగంగా నిర్మించిన శౌచాలయాలు (టాయిలెట్స్?) గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయని అమెరికాకు చెందిన అంతర్జాతీయ ఆహార పాలసీ పరిశోధక సంస్థ చేపట్టిన అధ్యయనం వెల్లడించింది. ఈ సంస్థ మన దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 600 జిల్లాల్లో 2000-2020 సంవత్సరాల మధ్య నిర్వహించిన జాతీయ స్థాయి సర్వేలను, ఇతర గణాంకాలను అధ్యయనం చేసింది. ఈ అధ్యయనం ప్రకారం, 'ఒక జిల్లావ్యాప్తంగా 10% మరుగుదొడ్లను అదనంగా నిర్మిస్తే శిశు మరణాలు 0.9%, ఐదేళ్లలోపు పిల్లల మరణాలు 1.1% మేర తగ్గాయి. దేశంలో 2014 అక్టోబరు 2న ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 2024 జులై వరకు దాదాపు 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించారు. వీటి కారణంగా వ్యక్తిగత పారిశుద్ధ్యం బాగా పెరిగింది. ఫలితంగా పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉన్నాయి. దీనితో ఏటా 60,000-70,000 మంది పిల్లల ప్రాణాలు నిలిచాయి. అంతేకాదు మరుగుదొడ్లను నిర్మించుకున్న ప్రతి కుటుంబం, ఆసుపత్రి ఖర్చులు తగ్గడం వల్ల ఏడాదికి రూ.50వేల వరకు లబ్ధి పొందింది.' అందుకే ఇలాంటి వినూత్న విధానాలను పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరించాలని సదరు అధ్యయనం సూచించింది.

ఇదే వేగం, పరంపర కొనసాగితే పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యమైన 500 గిగా వాట్లను 2030కల్లా సాధించగలమని ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తిలో 32 రెట్లు అధిక సామర్థ్యాన్ని సాధించామని ఆయన చెప్పారు. అంతర్జాతీయ సౌర పండగ సందర్భంగా గురువారం ఆయన ఒక వీడియో సందేశమిచ్చారు. 'గత కొన్నేళ్లుగా హరిత ఇంధన ఉత్పత్తి కోసం విప్లవాత్మక చర్యలు తీసుకున్నాం. పునరుత్పాదక ఇంధన లక్ష్యాల్లో భాగంగా పారిస్ ఒప్పందాన్ని చేరుకున్న తొలి జీ-20 దేశంగా ఇండియా నిలిచింది. సౌర విద్యుత్‌లో అసాధారణ విజయం సాధించడం ఇందులో కీలకమైన అంశం' అని ప్రధాని మోదీ అన్నారు. వేదాల్లోనే సౌర ఇంధన ప్రాముఖ్యం గురించి ఉందని ఈ సందర్భంగా మోదీ తెలిపారు.

# జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఉచితాల వర్షం




- మహిళలకు ఏటా రూ.18000!
- రెండు ఫ్రీ గ్యాస్ సిలిండర్లు

బలగం టీవీ, న్యూఢిల్లీ

కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉచిత పథకాలతో బీజేపీ మేనిఫెస్టోను 'సంకల్ప్ పత్ర్?' పేరుతో విడుదల చేశారు కేంద్ర మంత్రి అమిత్ షా. 'మా సమ్మాన్ యోజన కింద ప్రతి కుటుంబంలోని వృద్ధ మహిళకు ఏడాదికి రూ.18,000 ఇస్తామని ప్రకటించారు. ఉజ్వల పథకం కింద ప్రతి ఇంటికి ఉచితంగా రెండు గ్యాస్? సిలిండర్లు ఇస్తామని అన్నారు. ఇక ప్రగతి శిక్ష యోజన కింద కాలేజీ విద్యార్థులకు ఏడాదికి రూ.3000 చొప్పున ఇస్తామని అమిత్? షా ప్రకటించారు. ఈ సందర్భంగా అమిత్? షా? మాట్లాడారు. గత పదేళ్లలో జమ్మూకశ్మీర్? స్వర్ణ యుగాన్ని చూసిందన్నారు. శాంతి, అభివృద్ధి, పురోగతి అభివృద్ధికి హామీ ఇచ్చిందని తెలిపారు. అనంతరం ప్రతిపక్షాలపై మండిపడ్డారు.

"నేను ఎన్‌సీ(నేషనల్ కాన్ఫరెన్స్) పార్టీ ఎజెండా ఏంటో చూశాను. ఎన్‌సీకి కాంగ్రెస్ మౌనంగా మద్దతు ఇస్తుండటం కూడా చూశాను. కానీ నేను దేశ ప్రజలకు ఒకటే చెప్పదలచుకున్నా. ఇకపై అధికరణ 370 ఒక చరిత్ర, అది ఎన్నటికీ తిరిగి రాదు. ఈ ఆర్టికల్ యువత చేతుల్లో ఆయుధాలు, రాళ్లను మాత్రమే ఇచ్చింది. యువత ఉగ్రవాదం వైపు నడిచేలా చేసింది. నేను ఒమర్ అబ్దుల్లాకు ఒకటే చెప్పదలచుకున్నా, ఎన్నికల ఫలితాలు ఏమైనా కానీ, గుజ్జర్లకు ఇచ్చిన రిజర్వేషన్ల జోలికి ఎవ్వరినీ వెళ్లనివ్వం. గత పదేళ్లలో జమ్మూకశ్మీర్ స్వర్ణ యుగాన్ని చూసింది. శాంతి, అభివృద్ధి, పురోగతి అభివృద్ధికి హామీ ఇచ్చింది. జమ్మూకశ్మీర్‌లో తీవ్రవాదం ఆవిర్భావానికి బాధ్యులెవరో నిర్ధరించడానికి శ్వేతపత్రం విడుదల చేస్తాం. ఇక్కడ ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం. ఈ ప్రాంత అభివృద్ధికి భరోసా ఇచ్చేందుకు మాకు ఐదేళ్ల పదవీ కాలం ఇవ్వాలని జమ్మూకశ్మీర్? ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా" అని అమిత్? షా అన్నారు.

పండిట్ ప్రేమ్‌నాథ్ డోగ్రా రోజ్‌గార్ యోజన కింద 5 లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం. ప్రగతి శిక్షా యోజన కింద కళాశాలకు వెళ్లే విద్యార్థులకు 3వేల రూపాయల ట్రావెల్ అలవెన్స్‌ను అందించడం.

వైద్య కళాశాల్లో వెయ్యి అదనపు సీట్లను మంజూరు చేయడం.యూపీఎస్సీ, జేకేపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి కోచింగ్ ఫీజు కింద రెండేళ్ల పాటు 10 వేల రూపాయలతో పాటు ఒక్కసారి పరీక్ష ఫీజును చెల్లించడం.

మారుమూల ప్రాంతాలలో ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్.

వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్‌ను ప్రస్తుతం ఉన్న వాటి కంటే మూడింతలు చేసి ఇవ్వడం.

పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు జమ్మూలో ప్రాంతీయ అభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేయడం.

వీటితో పాటు జమ్మూకశ్మీర్‌ను టెరరిస్టు హాట్‌స్పాట్ నుంచి టూరిస్ట్ స్పాట్‌గా మారుస్తామని బీజేపీ మేనిఫెస్టోలో పేర్కొంది. హిందూ ఆలయాలను పునర్నిర్మించడం సహా పునరుద్ధరిస్తామని తెలిపింది. భూమి లేనివారికి అటల్ ఆవాస్ యోజన కింద 1361 చదరపు అడుగుల స్థలాన్ని ఉచితంగా ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.



# వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య విషయంలో మౌనం ఎందుకు..?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది..? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సహా ప్రభుత్వ పెద్దలు ఎవరు కూడా ఒక్క మాట ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. వరదల కారణంగా 31 మంది మృతి చెందారని, వారి వివరాలను బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ముందు ఉంచిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 16 మంది మాత్రమే మృతి చెందినట్లు చెబుతోందని, మృతుల సంఖ్య అంతే అని ఏ విధంగా నిర్ధారణకు వచ్చారని అడిగారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇంత మంది చనిపోయారని, బాధితుల పేర్లు, వివరాలు ప్రజలకు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. తప్పుడు లెక్కలు చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను అపహాస్యం చేస్తోందని దుయ్యబట్టారు. అదేవిధంగా మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి గతంలో డిమాండ్ చేసిన విధంగా ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని అన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన రెజ్లర్లు

(మొదటి పేజీ తరువాయి)

సెల్ మాత్రం సంబరాలు చేసుకుందన్నారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ, వినేశ్ కాంగ్రెస్‌లో చేరడం గర్వకారణమని అన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హతకు గురైనప్పుడు దేశం మొత్తం ఆమెకు అండగా నిలిచిందన్నారు. రెజ్లర్లు రైతులకు అండగా నిలిచారని, అగ్నిపథ్‌కి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు.

హర్యానా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్ 5న జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. వినేష్ జులనా లేదా దాద్రీ నియోజకవర్గం నుంచి, పునియా బద్లీ నుంచి పోటీ చేసే అవకాశాలున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.



# సీఎం రేవంత్ రెడ్డితో బీహెచ్‌ఈఎల్ సీఎండీ భేటీ !

బలగం టీవీ, హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డితో బీహెచ్‌ఈఎల్ సీఎండీ కె సదాశివమూర్తి భేటీ అయ్యారు. శుక్రవారం సచివాలయానికి విచ్చేసిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీహెచ్‌ఈఎల్ పురోభివృద్ధి, కార్యాచరణ ప్రణిళాకల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు.

# విస్కీ ఐస్ క్రీమ్‌లు

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి కలకలం సృష్టిస్తున్నవేళ తాజాగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో విస్కీ ఐస్ క్రీమ్‌లు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. మత్తుపై ఉక్కుపాదం మోపుతామని సర్కారు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నా మార్పు రావడం లేదు. ఏకంగా సామాజిక మాధ్యమాలనే వేదికగా చేసుకుని విస్కీ ఐస్ క్రీమ్‌లు విక్రయాలు చేస్తుండగా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు ఇద్దరిని అరెస్ట్ చేశారు.

చిన్నపిల్లలే లక్ష్యంగా విస్కీ ఐస్‌క్రీమ్‌లు విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారుల విచారణలో తేలింది. కిలో ఐస్ క్రీమ్‌లో 60 ఎంఎల్ విస్కీ కలుపుతున్నట్లు గుర్తించామని, నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతామని అధికారులు తెలిపారు. పూర్తి ఆధారాలు సమర్పించి నిందితులకు కఠినంగా శిక్షపడేలా చూస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. 21 ఏళ్లు దాటిన వారికే మద్యం విక్రయాలు చేయాలని చట్టాలు చెబుతున్నా వాటన్నింటినీ అతిక్రమించి ఏకంగా చిన్నారులే లక్ష్యంగా విస్కీ ఐస్‌క్రీమ్‌లు అమ్మడం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- మంత్రి సీతక్క
- వినాయక చవితి ఏర్పాట్లపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క టెలి కాన్ఫరెన్స్



బలగం టీవీ, హైదరాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులు సమన్వయంతో, అప్రమత్తంగా వ్యవహరించి శాంతియుత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు విజయవంతమయ్యేలా చూడాలని ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులు, డీపీఓలు, మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో వినాయక చవితి ఏర్పాట్లను సమీక్షించారు.

ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కడా ఇలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో శాంతికి విఘాతం కలిగించే చర్యలను తమ ప్రభుత్వం సహించదని, ఎంతటి వారినైనా కఠినంగా శిక్షిస్తామని మంత్రి సీతక్క హెచ్చరించారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీపడబోమని స్పష్టం చేశారు. అన్ని మతాల విశ్వాసాలను గౌరవిస్తమన్న మంత్రి, అందరి హక్కులను ప్రభుత్వం కాపాడుతుందని చెప్పారు. ప్రశాంత వాతావరణం లేకపోతే జిల్లా అభివృద్ధి కుంటుపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అందుకే ఇక్కడ ఏదైనా సమస్యలు తలెత్తితే దాని మూలాల్లోకి వెళ్లి తుంచేస్తామని స్పష్టం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే చట్టపరంగా కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లకు వంద శాతం జీతాలను తమ ప్రభుత్వం పెంచినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇంకా జిల్లా అభివృద్ధి కోసం మరెన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

వినాయక చవితి నేపథ్యంలో జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు పలు కీలక సూచనలు చేశారు మంత్రి సీతక్క. విగ్రహాల ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డయల్ 100కి వచ్చే కాల్స్‌పై తక్షణమే స్పందించాలనీ.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు ప్రచారం చేసే సోషల్ మీడియా మీద నిఘా పెంచాలని చెప్పారు. జైనూరు తరహాలోనే జిల్లా వ్యాప్తంగా అన్నివర్గాల మత పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి పరస్పరం విశ్వాసం నెల కొల్పేలా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. టెలి కాన్ఫరెన్స్ సందర్భంగా తమ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను, నెలకొని వున్న శాంతిభద్రతల పరిస్థితులను ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు మంత్రికి వివరించారు. మంత్రి సూచనలకు అనుగుణంగా అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేసి వినాయక చవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో విజయవంతం చేస్తామని తెలిపారు.

# అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి..



- బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి పనులపై జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వహక సంచాలకులు స్వప్న వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎంక్వైరీ వేగంగా పూర్తి చేసి చార్జీ షీట్ వేస్తే బాధితులకు న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందనీ,ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖల సహకారంతో జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అన్నారు. జిల్లాలో ఎస్టీ పథకాల ప్రయోజనాలు గిరిజనులు అందిపుచ్చుకునేలా, అలాగే వారి సమస్యలను జిల్లా యంత్రాంగానికి తెలియజేసేలా చూడాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. ఈ

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యా నాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు రమేష్, రాజేశ్వర్, ఎస్సీ సంక్షేమ అధికారిణి విజయలక్ష్మీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ స్వప్న, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జనార్ధన్, సభ్యులు సుధాకర్, రాంచందర్, తిరుపతి, బాలయ్య, బాలరాజు, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



## తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయానికి వెళ్లాను

- కేంద్ర మంత్రి బండి సంజయ్

**బలగం టీవీ ,హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, ఇలాంటి సమయంలో తాను రాజకీయాలను పక్కన పెట్టి తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయానికి వెళ్లానని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం రేవంత్ రెడ్డి తదితరులతో కలిసి వరదలపై సచివాలయంలో జరిగిన సమీక్షలో బండి సంజయ్ పాల్గొన్నారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.వర్షాలు, వరదల కారణంగా తెలుగు రాష్ట్రాల్లో భారీ నష్టం సంభవించిందన్నారు. కేంద్రం ప్రతి విషయాన్ని పరిశీలిస్తుందని తెలిపారు. వరద నష్టంపై తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన నివేదిక అందిందన్నారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఇచ్చిన నివేదికలను పరిశీలించిన అనంతరం రెండు రాష్ట్రాలకు కేంద్రం సాయం అందిస్తుందన్నారు.ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో రాజకీయం చేయడం సరికాదన్నారు. ఇది రాజకీయాలతో కూడిన సమస్య కాదని వ్యాఖ్యానించారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం చేయాల్సిన బాధ్యత అందరిదీ అన్నారు.

ఎస్డీఆర్ఎఫ్ నిధులు రూ.1,345 కోట్లు ఉన్నాయని, వీటిని గత ప్రభుత్వం ఉపయోగించుకోలేకపోయిందని విమర్శించారు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకు వెళతామన్నారు. తెలుగు రాష్ట్రాలను ఆదుకుంటామని శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారన్నారు.

## సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ ఇక లేరు

- మానేరు గడ్డమీద నుంచి ఎదిగొచ్చిన వడ్డేపల్లి కృష్ణ..
- చేనేత కుటుంబం నుంచి సాహిత్యం వైపు..

**బలగం టీవీ , సిరిసిల్ల**



చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' గీతంతో ప్రఖ్యాతిగాంచిన కవి, సినీ గేయ మరియు లతితగీతాల రచయిత వడ్డేపల్లి కృష్ణ (76) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్లోని నిమ్స్ ఆస్పత్రి లో చికిత్స పొందుతు శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. వడ్డేపల్లి కృష్ణ ప్రామాణిక పరిశోధకుడిగా, టెలివిజన్ ధారావాహికల దర్శకుడిగా, గీత రచయితగా, వివిధ డాక్యుమెంటరీల రూపకర్తగా, అనేక పుస్తకాలతో పాటు, ఆడియో ఆల్బమ్ ల రూపకర్తగా, సంగీత, నృత్య రూపకాల రచయితగా, వివిధ నాటక రచయితగా, విభిన్న కోణాల్లో తన రచనా నైపుణ్యం తో సాహిత్య సేవలు అందించారు.

**సినారే స్ఫూర్తితో సాహిత్యం వైపు..**

రాజన్న సిరిసిల్ల లో చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డే పల్లి కృష్ణ తపాలా శాఖలో ఉద్యోగం చేస్తూ హైదరాబాద్ నాగోల్ లో స్థిరపడ్డారు.బాల్యం నుండే సినారె స్ఫూర్తితో సాహిత్యం పట్ల ఎక్కువ అభిరుచి ఉండడం, సాహిత్యం, పద్యాలపై మంచి పట్టు ఉండడంతో సినిమాలపై దృష్టి సారించాడు.

పిల్లజమీందార్ – నీచూపులోన.. విరజాజివాన, అమృతకలశం – సిగ్గాయే సిగ్గాయేరా స్వామీ, బుగ్గంతా ఎరుపాయేరా మానసచోరా నిను చేర, యుగకర్తలు – తాగినోడి మాట.. తందనాల వేదమట. న్యాయమున్నా.. ధర్మమున్నా.. నరకమున్నా.. బతుకు బాట,పెద్దరికం – ముద్దుల జానకీ.. పెళ్లికీ.. మబ్బుల పల్లకీ తెవలనే, ఆశల రెక్కల హంసలు పల్లకీ మోసుకుపోవలనే ,భైరవద్వీపం – అంబా శాంభవి భద్రరాజ గమన కాళీ,పిలిస్తే పలుకుతా – సమత మమతల సాకారాం.. పిలిచిన పలికే ఓంకారం లాంటి ఆణిముత్య లాంటి సినీ గేయాలు అందించి సినీ గేయ రచయితగా తనదైన ముద్ర వేసుకున్నారు.

**దర్శకుడిగా.... తనదైన శైలి..**

సాయికుమార్ హీరోగా ఎక్కడికెళ్తుందో మనస్సు అనే సినిమాకు దర్శకత్వం వహించాడు. వడ్డేపల్లి కృష్ణ తీసిన అంతరించి పోతున్న గోవులపై గోభాగ్యం అనే డాక్యుమెంటరీ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్లో బహుమతి గెలుచుకున్నాడు, అంతేకాకుండా బతుకమ్మ, ఆత్మహత్య, నేతన్నలు వంటి డాక్యుమెంటరీలకి జాతీయస్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డులు అందుకున్నాడు. టెలివిజన్ లో భక్త కవి పోతన, భారతీయ సంస్కృతీ శిఖరాలు వంటి సీరియల్స్ కు డైరెక్ట్ చేసి బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. బలగం సినిమాలో నటుడిగా నటించారు..

**25 ప్రక్రియల్లోను రచనలు చేసిన ఏకైక రచయిత...**

సాహిత్య రంగంలో 25 ప్రక్రియల్లోను రచనలు చేసిన ఏకైక రచయిత వడ్డేపల్లి కృష్ణ.వందేళ్ల లో వెలువడిన పది వేల లలితగీతం, లక్షణం, నిర్వచనం పరిశీలించి లలిత గీతాలపై మొట్టమొదటిసారిగా పీహెచ్డీ చేశాడు.తెలంగాణపై అభిమానంతో తెలంగాణ భాష, యాసతో వెలుగచ్చింది నాటకాన్ని రాశాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 'జయ జయహే తెలంగాణ– నృత్య రూపకం రచించాడు.

కరీంనగర్ క్షేత్రాలు అనే ఆడియో సీడీ తీసుకువచ్చి,తానా సభలకు సంగీత నృత్యరూపకాలు అందించాడు. రచయితగా, దర్శకుడిగా, వ్యాఖ్యాతగా, నంది అవార్డ్స్ కమిటీ చైర్మన్గా, ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫిల్మిం ఫెస్టివల్ జ్యూరీ మెంబర్గా, పాడుతాతీయగా పాటల కార్యక్రమానికి జడ్జిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు సంపాదించుకున్నారు.వడ్డేపల్లి కృష్ణ మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు

# కార్పొరేట్‌కు దీటుగా సర్కారు వైద్యం...

- 24 గంటలు.. 23 ఆపరేషన్లు..
- వేములవాడ ఏరియా ఆసుపత్రి మరో రికార్డు
- గర్భిణులు, ఇతర రోగులకు మెరుగైన సేవలు
- వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య.





**బలగం టీవీ ,వేములవాడ**

కార్పొరేట్ కు దీటుగా ముందుకు సాగుతున్నది ఆ సర్కార్ దవాఖాన.24 గంటల్లో 23 ఆపరేషన్లు చేసి సర్కార్ దవాఖాన సత్తా చాటారు వైద్యులు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో వేములవాడ సర్కార్ దవాఖాన మరో అరుదైన రికార్డు సొంతం చేసుకుంది.

వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో గత 24 గంటల్లో మరోసారి రికార్డు స్థాయిలో 23 వివిధ రకాల ఆపరేషన్లు అయ్యాయి. ఇందులో 10 డెలివరీలు,2 గర్భసంచి లో గడ్డ, 5 సాధారణ శస్త్ర చికిత్సలు, 1 కంటి ఆపరేషన్ మరియు 5 ఆర్తో ఆపరేషన్లు జరిగాయి. ఈ ఆపరేషన్లు లో సూపరింటెండెంట్ సీనియర్ సర్జన్ డాక్టర్ పెంచలయ్య, గైనకాలజిస్ట్ డాక్టర్లు సంధ్య, కంటి వైద్య నిపుణులు రత్నమాల, ఆర్థో డాక్టర్ అనిల్ మరియు మత్తు వైద్య నిపుణులు డా.రాజశ్రీ,డా.తిరుపతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రభుత్వ విప్, కలెక్టర్ సహకారంతో..**

వంద పడకల ఆసుపత్రి లో ప్రస్తుతం అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని సూపరింటెండెంట్ సీనియర్ సర్జన్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సహకారంతో మరిన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వివరించారు. పోస్టు మార్టం సేవలు, స్కానింగ్ సేవలు కొనసాగుతున్నాయని అన్నారు.

**వేములవాడలో సదరం శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి**

వేములవాడ నియోజక వర్గంలో సదరం క్యాంపునకు దరఖాస్తు చేసుకున్న వారు ఆయా తేదీల్లో నిర్ణయించిన సమయానికి రావాలని డాక్టర్ పెంచలయ్య సూచించారు. వైకల్య నిర్ధారణ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పోషణ మాసం సందర్భంగా అవగాహన సదస్సు



**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని తాడూరు గ్రామంలో పోషణ మాసం లో భాగంగా అంగన్వాడీ సెంటర్ రెండు లో సిడిపిఓ సబితా, సూపర్వైజర్ సుస్మిత పర్యటించి గర్భిణీ స్త్రీలకు పోషకాహారం ఆరోగ్యం పట్ల జాగ్రత్తలను వివరిస్తు ప్రతి ఒక్కరూ రక్తహీనతకు గురికాకుండా ఉండాలని తినే ఆహారంలో ఆకుకూరలు పాలు పండ్లు కూరగాయలు తీసుకోవాలని సూచించారు. సరైన సమయానికి నిద్ర పోవాలని మరియు ప్రతినెల అంగన్వాడి సెంటర్ లో బరువు చుట్టుకొలతలు తెలుసుకోవాలని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డెలివరీ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు కొండే కొప్పుల పద్మ,ఆశ బిట్ల లావణ్య, గర్భిణీ స్త్రీలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



## భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి నీటిమట్టం

**బలగం టీవీ ,హైదరాబాద్**

ఎగువ నుంచి వరద తగ్గడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 42.2 అడుగుల వద్ద వరద ప్రవహిస్తుండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. శుక్రవారం రాత్రికి మరింతగా వరద తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అలాగే తాలిపేరుకు ఎగువ నుంచి వరద వస్తుండడంతో అధికారులు 24 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 17,704 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 74 మీటర్లు కాగా.. ప్రస్తుతం 69.90 మీటర్ల మేర నీరు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు.



## కృష్ణమ్మకు పోటెత్తిన వరద..

- శ్రీశైలం 6 గేట్లు ఎత్తివేత..

**బలగం టీవీ ,హైదరాబాద్**

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నదికి మళ్లీ వరద పోటెత్తింది. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ వైపు కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది.

శ్రీశైలం స్పిల్ వే ద్వారా 1.67 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 1.64 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 884.4 అడుగులుగా ఉంది. శ్రీశైలం గరిష్ఠ నీటినిల్వ 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 212.9 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ముమ్మరంగా కొనసాగుతోంది. విద్యుత్ ఉత్పత్తి చేసి 67,631 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

## ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బలగం టీవీ ,వేములవాడ**

వేములవాడ లోని మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్, స్టోర్ రూమ్ తదితర గదులు పరిశీలించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో విద్యాలయం ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని విద్యా సంస్థల ఓఎస్డీ సర్వర్ మియాను ఆదేశించారు విద్యార్థులను మ్యాథ్స్ ,సైన్స్ ఇంగ్లీషులో రాణించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## జగన్ లండన్ టూర్ వాయిదా

**బలగం టీవీ ,హైదరాబాద్**



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లండన్ పర్యటన వాయిదా పడింది. జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3 నుండి 25 తేదీ దాకా కుటుంబసమేతంగా వెళ్లేందుకు లండన్ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే ఎన్నికల్లో అధికారం కోల్పోవడంతో డిప్లొమాటిక్ పాస్‌పోర్టును అధికారులు రద్దు చేశారు. దీంతో సీబీఐ కోర్టు జగన్‌మోహన్‌రెడ్డికి ఐదేళ్లపాటు సాధారణ పాస్‌పోర్డును మంజూరు చేయాలని ఆదేశించింది. అయితే, ప్రజాప్రతినిధుల కోర్టు నుండి ఎన్ఓసి కావాలని పాస్‌పోర్టు కార్యాలయ అధికారులు కోరారు. ప్రజాప్రతినిధుల కోర్టు కొన్ని షరతులు విధించడంతో వాటిని సవాల్ చేస్తూ శుక్రవారం హైకోర్టులో జగన్‌మోహన్‌రెడ్డి లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రానుంది.

## మణిపూర్ మాజీ సీఎం ఇంట్లో పేలుడు..వృద్ధుడి మృతి

**బలగం టీవీ ,హైదరాబాద్**

మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి మైరెంబం కోయిరెంగ్ నివాసంపై తీవ్రవాదులు జరిపిన బాంబు దాడిలో ఒక వృద్ధుడు మరణించగా ఐదుగురు గాయపడ్డారు. తీవ్రవాదులు పేల్చిన రాకెట్ కోయిరెంగ్ ఇంటి ప్రహరీ గోడలోపల పేలగా ఏదో పూజ కోసం ఏర్పాట్లు చేస్తున్న ఒక వృద్ధుడు మరణించాడు. ఒక 13 ఏళ్ల బాలికతోసహా ఐదుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఈ జిల్లాలో తీవ్రవాదులు రాకెట్ పేల్చడం ఇది రెండవ ఘటనగా పోలీసులు తెలిపారు.ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఐఎన్ఎ) ప్రధాన కార్యాలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ రాకెట్ పేలుడు జరిగింది. 1944 ఏప్రిల్ 14న ఐఎన్ఎ సుప్రీం కమాండర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మేరకు మొయిరంగ్‌లో భారత గడ్డపై మొటట్మొదటిసారి భారత త్రివర్ణ పతాకాన్ని ఐఎన్ఎ లెఫ్టినెంట్ కల్నల్ షౌకత్ అలీ ఎగురవేశారు. కాగా..రాష్ట్ర రాజధానికి 45 కిలోమీటర్ల దూరంలోని ట్రాంగ్‌లావ్‌బీకి చెందిన నివాస ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఒక రాకెట్ పేలుడు సంభవించింది.

# హైజంప్‌లో ప్రవీణ్‌కు పసిడి



**బలగం టీవి, పారిస్**

పారిస్ వేదికగా జరుగుతున్న పారాలింపిక్స్‌లో భారత్ పతకాల వేట శుక్రవారం కూడా కొనసాగింది. పురుషుల హైజంప్‌లో భారత అథ్లెట్ ప్రవీణ్ కుమార్ పసిడి పతకం సాధించాడు. దీంతో పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ సాధించిన పతకాల సంఖ్య 26కు చేరింది. భారత్ ఇప్పటి వరకు ఆరు స్వర్ణాలు, 9 రజతాలు మరో 11 కాంస్య పతకాలను సాధించింది. కాగా, శుక్రవారం జరిగిన టి64 హైజంప్ విభాగం పోటీల్లో ప్రవీణ్ 2.08 ఎత్తు జంప్ చేసి పసిడి పతకాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో ఇదే అత్యుత్తమ హైజంప్ రికార్డు కావడం విశేషం. కాగా, పారాలింపిక్స్‌లో ప్రవీణ్‌కు ఇది వరుసగా రెండో పతకం. గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో ప్రవీణ్ రజతం సాధించాడు. ఈసారి మరింత మెరుగైన ప్రదర్శనతో ఏకంగా పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇదే సమయంలో అతిచిన్న వయసులో పారాలింపిక్స్ స్వర్ణం సాధించిన అథ్లెట్‌గా చరిత్ర సృష్టించాడు.

ఇక పారాలింపిక్స్ హైజంప్ పోటీల్లో పసిడి పతకం సాధించిన రెండో భారత అథ్లెట్‌గాకూడా ప్రవీణ్ రికార్డు నెలకొల్పాడు. ఇంతకుముందు మరియప్పన్ తంగవేలు హైజంప్ విభాగంలో స్వర్ణం సాధించాడు. ఇదిలావుండగా పారిస్ పారాలింపిక్స్ హైజంప్ విభాగంలో భారత్‌కు ఇప్పటి వరకు మూడు పతకాలు లభించాయి. శరద్ కుమార్ రజతం సాధించగా, మరియప్పన్ కాంస్యం గెలుచుకున్నాడు. నోయిడాకు చెందిన ప్రవీణ్ కుమార్‌కు పుట్టుకతోనే కాలి వైకల్యం ఉంది. ఓ కాలు చిన్నగా ఉండటంతో చిన్నప్పుడూ ఎన్నో అవమానాలు భరించాల్సి వచ్చింది. చాలా ఏళ్ల వరకు ఆత్మన్యూనతా భావంతో బాధపడేవాడు. దాన్ని పోగొట్టుకునేందుకు క్రీడల వైపు మొగ్గాడు. ఆరంభంలో వాలీబాల్ ఎక్కువగా ఆడేవాడు. ఆ తర్వాత అథ్లెటిక్స్ కోచ్ సత్యపాల్ సింగ్ సూచన మేరకు హైజంప్ వైపు మళ్లాడు. సత్యపాల్ సింగ్ ప్రవీణ్ మేటి అథ్లెట్‌గా తీర్చిదిద్దారు. సత్యపాల్ శిక్షణలో రాటుదేలిన ప్రవీణ్ చిన్న వయసులో రెండు పారాలింపిక్స్ పతకాలు సాధించి సత్తా చాటాడు.



## డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు నీరజ్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈ నెల 13, 14 తేదీలలో బ్రస్సెల్స్ (బెల్జియం) వేదికగా జరుగబోయే ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. ఈ ఏడాది దోహ, లుసానే డైమండ్ లీగ్స్‌లో పాల్గొని 14 పాయింట్లు సాధించిన నీరజ్.. నాలుగో స్థానంతో తుది పోరులో చోటు దక్కించుకున్నాడు.ఈ జాబితాలో అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జులియన్ వెబర్ (జర్మనీ), జాకబ్ వాడ్లెచ్ (చెక్) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కాగా ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయాడు.




## 27న దేవర ట్రైలర్..?

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఎన్టీఆర్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమా 'దేవర'. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రం తొలి పార్ట్ ఈ నెల 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. దర్శకుడు కొరటాల శివ కచ్చితంగా విజయం సాధించాలనే కసితో ఈ ఫ్రాంచైజీని తెరకెక్కిస్తున్నారని నిర్మాతలు నందమూరి కల్యాణ్‌రామ్, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ చెబుతున్నారు.ఇప్పటికే ప్రచారంలో భాగంగా విడుదలైన పాటలకు అద్భుతమైన స్పందన వస్తున్నది. ఇదిలావుంటే.. సినిమా విడుదల దగ్గరపడుతున్న సందర్భంగా ఈ నెల 10న ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. అయితే.. ఈ డేట్‌పై అధికారికంగా ఇంకా క్లారిటీ రావాల్సివుంది. జాన్వీకపూర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సైఫ్ ఆలీఖాన్ విలన్‌గా కనిపించనున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడు.




# ఆసక్తికరంగా దులీప్ ట్రోఫీ

**బలగం టీవి, అనంతపురం**

దులీప్ ట్రోఫీలో ఇండియా–సి, ఇండియా–డి మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 91/4తో రెండో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా–సి 168 పరుగులకు ఆలౌటైంది. బాబా ఇంద్రజిత్ (72బీ 149 బంతుల్లో 9ఐ4) అర్ధ సెంచరీతో రాణించడంతో ఇండియా–సికి నాలుగు పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. ఇండియా–డి బౌలర్లలో హర్షిత్ రాణా (4/33), అర్ష్‌దీప్ సింగ్ (1/29), ఆదిత్య థాకరే (1/33), అక్షర్ పటేల్ (2/46), సారాంష్ జైన్ (2/16) మెరిశారు. అనంతరం శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇండియా–డి రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 206 పరుగులు సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (54), దేవ్‌దత్ పడిక్కల్ (56), రిక్కీ భుయ్ (44) సత్తాచాటారు. ఇండియా–సి ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ (5/30) విజృంభించి ఇండియా–డిని కట్టడి చేశాడు.ఇండియా–డి తొలి ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌటైంది.



ఇండియా–ఎతో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో యువ ఆటగాడు ముషీర్‌ఖాన్ (181) అదరగొట్టాడు. భారీ ఇన్నింగ్స్‌తో ఇండియా–బిని మెరుగైన స్థితిలో నిలిపాడు. పేసర్ నవదీప్ సైని (56) అర్ధ సెంచరీతో సత్తాచాటి ముషీర్‌కు అండగా నిలిచాడు. ఫలితంగా ఓవర్‌నైట్ స్కోరు 202/7తో శుక్రవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా–బి 321 పరుగులు చేసింది. ముషీర్, సైని ఎనిమిదో వికెట్‌కు 205 పరుగులు జోడించడం విశేషం. ఇండియా–ఎ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ (2/54), ఆకాశ్ దీప్ (4/60), అవేష్‌ఖాన్ (2/59) రాణించారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా–ఎ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 134 పరుగులు సాధించింది. నవదీప్ సైని (2/36) రెండు వికెట్లు పడగొట్టాడు. మరో రెండ్రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో ఇండియా–ఎ ఇంకో 187 పరుగులు వెనుకంజలో ఉంది. రియాన్ పరాగ్ (27 బ్యాటింగ్), కేఎల్ రాహుల్ (23 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

## బాలకృష్ణ తనయుడి ఎంట్రీ

**బలగం టీవి, హైదరాబాద్**



నందమూరి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తొలి సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. బ్లాక్‌బస్టర్ 'హను–మాన్' ఫేం ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి తన ఎస్వీఎల్ సినిమాస్‌పై లెజెండ్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు.బాలకృష్ణ చిన్నకుమార్తె తేజస్విని ఈ సినిమాకి సమర్పకురాలు కావడం విశేషం. శుక్రవారం మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఆయన్ని స్టైలిష్ అండ్ మోడరన్ అవతార్‌లో ప్రజెంట్ చేస్తూ ఓ స్టిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆకర్షణీయమైన చిరునవ్వుతో, మెస్మరైజింగ్ ప్రజెన్స్‌తో చాలా అందంగా కనిపిస్తున్నారు మోక్షజ్ఞ.

ప్రశాంత్‌వర్మ మాట్లాడుతూ 'మోక్షజ్ఞను హీరోగా పరిచయం చేసే అవకాశం రావడం గొప్ప గౌరవంగా, అంతకంటే పెద్ద బాధ్యతగా భావిస్తున్నా. ఇది ఇతిహాసాల నుంచి స్ఫూర్తి పొందిన స్క్రిప్ట్. ప్రశాంత్ వర్మ సినిమా యూనివర్స్‌లో ఇది ఒక భాగం. నా యూనివర్స్‌ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లే సినిమా అవుతుంది. ప్రస్తుతం మోక్షూ నటశిక్షణలో ఉన్నారు. డ్యాన్స్, ఫైట్లు.. ఇలా ప్రతి విషయంలో స్పెషల్ ట్రైనింగ్ తీసుకుంటున్నారు.ఈ సినిమాతో ఓ గొప్ప స్టార్‌ని ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్న క్రెడిట్ నాకు దక్కనున్నది' అని ఆనందం వ్యక్తం చేశారు. 'మోక్షజ్ఞని హీరోగా లాంచ్ చేసే సువర్ణావకాశాన్ని మాకిచ్చిన బాలకృష్ణగారికి కృతజ్ఞతలు. ప్రశాంత్‌వర్మ అద్భుతమైన స్క్రిప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని నిర్మాత సుధాకర్ చెరుకూరి తెలిపారు.ఇదిలావుంటే.. మోక్షజ్ఞ తెరంగేట్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ ఇద్దరూ తన ఎక్స్(ట్విటర్) ద్వారా మోక్షజ్ఞకు శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. 'తాతగారి ఆశీస్సులతో నువ్వు పెద్ద హీరోగా ఎదగాలి' అంటూ తారక్, కల్యాణ్‌రామ్ తన ట్విటర్స్‌లో పేర్కొన్నారు.